కథానిక

# ఈ కాలపు న్యాయం

శ్రీ సౌమిత్రి

ఆ యిల్లు గాలివానలకు తట్టుకొని నిలబడింది. కాని ఆనాడు ఎండాకాలపు చివరిరోజుల లోని గాలి దుమారానికి వున్నట్టుండి కూలిపోతుం దేమో అన్నట్టుగా పైకప్పు కొద్దిగా కదిలింది.

"అమ్మో, నా యిల్లు కూలిపోతూంది! రండి రండి. ఇల్లు నిలబెట్టండి!" అంటూ ఆ యింటి యజమాని లాల్ జీ వీధిలోకి వచ్చి గొంతెత్తి పిలిచాడు.

మే నెలతాలూకు ఆఖరిరోజులు. వెచ్చగాడ్పుల వడగాల్పులతో పెద్ద గాలిదుమారం వున్నట్టుండి ప్రకృతంతా దుమ్మెత్తిపోస్తూ నానా భీభత్సంగా మారిపోయింది.

లాల్ జీ పిలుపు వినేవాళ్ళుగాని, కనీసం అతని ఆక్రందనాన్ని చెవుల పట్టించుకున్న వాళ్ళుగాని ఎవ్వరూ కనిపించలేదు!

పిచ్చితనం కాకపోతే, అటువంటి సమయములో వడగాడ్పులు ఆ చెవినించి ఈ చెవిలోకి పోయే ఆ మిట్టమధ్యాహ్నపు యెండలో ఎవరు వస్తారు?

లాల్ జీకి ఇవేవీ పట్టలేదు. తన ఆంక్రదనాన్ని పిలుపుని ఎవరన్నా వినకండాపోరనీ, సహాయం చేసి నిలబెట్టేందుకు జనమంతా పరుగెత్తుకు వస్తారని అతని ఉద్దేశ్యం.

అయినా ఎవరూపరుగెత్తలేదు సరికదా సానుభూతి చూపించి వద్దామని కూడా అనుకోలేదు. ఎవరికివాళ్ళు ఆ గోడలు విరిగి మీద పడతాయనీ స్థంభాలు జారిపోయి దెబ్బలు తగులుతాయనీఅనుకున్నారు.

అయినా మళ్లీ పిలిచాడు లాల్ జీ.

"రండి. రండి-ఇల్లు కూలిపోతున్నది. సహాయం చేసి యిల్లు నిలబెట్టండి."

విచిత్రం! అంతా సమ్మెచేసినట్లు తమని కాదన్నట్లు, ఆ యిల్లు కూలిపోవడమే మంచిదనుకుంటున్నట్లు బైటవాళ్ళంతా పొంచిపొంచి దూరంనుంచే చూస్తూ నిలుచున్నారు.

చాలామంది ఆ పిలుపులనీ, కేకల్ని విని ప్రక్క సందులనుంచి జారుకుంటున్నారుకూడా!

ఏమిటో అంతభయం—రెండు చావులు లేవు కదా మనిషికి?

ఒకరికొకడు సహాయం చేసుకోనిదే, పరస్పర సహకార సానుభూతులు లేనిదే మానవలోకం నిలపడదనే సంగతి వాళ్ళెవరూ గుర్తించలేకపోయారు!

లాల్ జీ మళ్ళీ పిలిచాడు. వేడుకున్నాడు—ఆక్రందనాన్ని చేసాడు—

అయినా హోరునవీచే వడగాలినీ ప్రళయ జంఝామారుతంలా కదిలే చెట్లనీ చూస్తూ, రాజయ్యా, లింగయ్యా, కామయ్యా, సుబ్బయ్యా, భక్తయ్యా, రెడ్డయ్యా అంతా అలానే విడ్డూరంగా నిలుచున్నారు.

మళ్ళీ మొత్తుకున్నాడు లాల్ జీ.

ఏమీ లాభంలేకపోయింది. అందర్నీ వరసగా చూసి పేరుపేరునా పిలిచాడు.

లాల్ జీ పిలుపును ఎలా విన్నాడో ఎప్పుడు విన్నాడో రెక్కలుకట్టుకున్నట్టు క్షణంలోవచ్చి అక్కడ చేరాడు ప్రకాశరావు.

సమయానికి సహాయంచేసేవాళ్ళు లేక తన పిలుపును వినేవాళ్ళులేక దిగాలుపడ్డ లాల్ జీకి ప్రకాశరావును చూడ్డంతో కొంతధైర్యంవచ్చింది.

ఆ పెనుగాలి వీచికలతో వూగిపోయి కూలిపోడానికి సిద్ధంగావున్న ఆ యింటికి నిట్టాడిగా నిలపడి ప్రకాశరావు గాలిదుమారం తగ్గేవరకూ ఆపగలిగాడు!

నిజంగా ఫిరంగిముందు నిలబడివున్న కోటగోడలా కదనరంగంలో వెన్ను చూపకుండా మరతుపాకిముందు గుండెనిచ్చి నిబ్బరంగా నుంచున్న మహావీరుడిలా తరుణంలోవచ్చి నిలబడి ఆదుకున్నందుకు లాల్ జీ ఎంతో మెచ్చుకుని,

"మీరు లేకపోతే యేమైపొయ్యేవారమో? ధైర్యమంతేమీదే-ఈ పాటికి ఇల్లు నిలువునా

కూలిపోయి వుండును-మీ సాహసాన్ని జీవితంలో మర్చిపోను" అన్నాడు.

"మానవులం ఒకరికొకరం సహాయంచేసుకోవడంలో విచిత్రమేముంది? దీనికని మీరు ఏవేవో మాట్లాడం బావుండలేదు" అన్నాడు ప్రకాశరావు.

"వాళ్ళంతా విచిత్రంగా చూస్తూ, ఎక్కడ చచ్చిపోతామనో కూలి పడిపోయే యింటి ఛాయలికి కూడా రాకుండా నిలుచుని తమాషాగా చూస్తున్నప్పుడు—"

లాల్‌జీకి-ఏమని మాట్లాడి తన కృతజ్ఞతని తెలియపరచాలో తెలియలేదు. మాటల్ని మింగుకుంటూ ప్రకాశరావువైపు నమ్రతగా చూశాడు.

నవ్వి "మీరింకా చినవాళ్లు ఇల్లు కూలి పడిపోయే స్థితిలో మంచిచెడ్డలు తెలుసుకొని దుఃఖితుల విచారాన్ని పోగొట్టడం మానవధర్మం. ఐనా వాళ్ళంతా ముఖ్యంగా భయపడిపోయారు. అంతమాత్రాన మీరు ఒకర్ని గొప్పగా మరొకర్ని చిన్నగా చూడ్డం భావ్యంకాదు. మానవులు అందులోను చాలా పిరికితనంగల మానవులు: ఒకరు నిప్పుల్లో దూకేవరకే విచిత్రంగాచూస్తారు, ఆ తర్వాత వాళ్ళకీ పరివర్తనమనేది వస్తుంది. అయినా ఏనుగంత గుండెకాయలు ఎవరికీవుండవు కదా" అన్నాడు.

ధైర్యమైన పనిచేసినందుకు ప్రకాశరావుమీద లాల్‌జీకి అభిమానం పుట్టుకువచ్చింది. ఏవిధంగా చూచినా అతని సాహసం చెప్పుకోదగ్గదిగానే వున్నది, చాలాసేపు వూరుకొని "మిమ్మల్నొకటికి కోరుతున్నాను. మీ రింకోవిధంగా అపార్థం చేసుకోరని నాకు నమ్మకం" అన్నాడు లాల్‌జీ.

ప్రకాశరావు లాల్‌జీ కళ్ళలోకి నవ్వుతూ చూసి, "బాగా నేవుంది" అన్నాడు.

"మీ మాతృభాష కాకపోయినా మనం అంతా ఈ దేశంవాళ్లం-మీలాంటివాళ్ళ సహాయ సంపత్తులు మాకు ముఖ్యంగా కావాలి. ఇంకో విధంగా అనుకోకుండా వున్నట్లయితే రేపటికి నుంచి మీరు మా వ్యాపారంలో అన్నివిధాలా అండగా వుంటారని నమ్ముతున్నాను."

లాల్‌జీ మాటలు ప్రకాశరావు హృదయాన్ని బాగా ఆకర్షించినయ్. ఇంకేమీ మాట్లాడకండానే ప్రకాశరావు "సరే"నంటూ వెళ్ళిపోయాడు.

లాల్‌జీ వ్యాపారం అంతకంతకీ వృద్ధిలోకి రావడం-బైటవూళ్ల ఆసామీలు ఇదివరకటికంటే ఎక్కువగా వస్తూపోతూ వుండడం లాల్‌జీగారి యింట్లో కాస్త సందడిగానే వుంటుంది.

లాల్‌జీగారు ఆ యింటి కిటికీవద్ద తివాసీ దిండ్లు వేసుకొని కూర్చుని వుంటాడు. కానీ ఎప్పుడూ అతని దృష్టి-బైట బజార్లో జరిగే విషయాలమీదా చిత్రాలమీదే వుండడం చెప్పుకోదగ్గ విషయం.

లాల్‌జీకి ఎదురుగా మరో గద్దెమీద కొత్తగా తయారుచేయించుకున్న డ్రాయరు బల్లముందు కూర్చొని తన పనులు చూచుకుంటూ వుంటాడు ప్రకాశరావు.

రానురాను—ఏ సమయంలో ఏమిటి చెప్పాలనుకున్నా లాల్‌జీగారు వినే ధోరణిలో వుండకపోవడం మామూలైపోయింది.

ఎంతసేపూ బైటిచూపేగాని ఇంట్లో చూపు లేక పోవడంవల్ల ఇంట్లోనుంచి ఎవరు ఏమిచెప్పినా లాల్‌జీగారి చెవిలో పడకండానే గాలిలో కలిసిపోతూ వుండేది.

చెదిరిపోయిన అనేక వ్యవహారాల్ని కూడదీసి ఒక తాటిమీదికి తేవడం రావుకి చాలా కష్టమైనా ఓరుపుతో సాధించగలిగాడు!

పూర్వంలా లాల్‌జీకి వ్యాపారంలేదు. అతను యింత విస్తృతంగా తన వ్యాపారం అల్లుకుపోతుందని అనుకోనేలేదు. ఊపిరి పీల్చి వదలడానికి కూడా లాల్‌జీకి యిప్పుడు తీరిక దొరకడంలేదు... ఏవేవో... ఎన్నెన్నో రకరకాల ఆలోచనలూ, తన వ్యాపారంలోంచి మంచిచెడ్డలు నీతినిజాయితీ అందర్నీ ఆకర్షిస్తున్నకొద్దీ ఆయన హృదయం గంతులువేసేది,

కళ్లద్దాలు సరిచేసుకొని ముక్కుపొడుం పీల్చి, చిటికెలువేస్తూ ఒకనాడు రాజయ్య లాల్‌జీ గుమ్మంలో కాలుపెట్టాడు. లాల్‌జీకి చాలా ఆశ్చర్యంవేసింది.

"ఓహో రాజయ్యగారా?—రండి రండి!" అన్నాడు.

"లాల్‌జీగారా! చాలాదీర్ఘాలోచనలో వున్నట్టున్నారే—" అనుకుంటూనే లోనికి ప్రవేశించాడు రాజయ్య!

"ఏముంది మామూలు ఆలోచనే. చాలాకాలా

ఠికి కనిపించారు ఏమిటో విశేషం వుండి వుంటుంది!"

"అబ్బే. మీ వ్యవహారాలు ఎలావున్నాయో ఓసారి చూచిపోదామని..."నసిగాడు రాజయ్య.

"సరిసరి మీరులేని వ్యవహారమా?" గద్దెమీది నుంచి దిగివచ్చి లాల్ జీ స్వాగత మిచ్చాడు రాజయ్యకు.

తలవంచుకొని తనపనులు చూచుకుంటున్న ప్రకాశరావుకు ఇద్దరి మాటలూ వినిపిస్తూనే వున్నయ్!

"పెద్దవారు తాము లేనిలోటు కనిపిస్తూనే వుంది!"

"ఏమిటో పెద్దరికం? ఆనాడు సందుసందుల్లో తప్పుకొని తిరిగిన రకాలుకాదూ?" అనుకున్నాడు ప్రకాశరావు.

"నాదేముందండి లాల్ జీగారూ? అయినా వ్యాపార విషయాలు కొన్ని అడిగి తెలుసుకుందామని ఇటువచ్చాను లెండి!"

"మంచి మాటన్నారు. తెలుసుకోవడమేమిటి? మిమ్మల్ని చాలారోజులనుంచి కలుద్దామనుకుంటున్నాను. తీరిక దొరకడంలేదు చూస్తూనే వున్నారుగా పాపం ప్రకాశరావు ఎలా శతమతమౌతున్నాడో? మీరుకూడా ఈ వ్యవహారాల్లో నాకు తోడుపడ్తువుంటే నే నింకేమీ విచారించను. కుడి భుజంలా మిమ్మల్ని చూసుకుంటాను. మీ సలహా సంప్రదింపులూ మాకు ముఖ్యంగా కావాలి. అదిగో ఆ గద్దెమీద కూర్చొని అవి కాస్తా చూసి పెడుతూవుండండి చాలు!" అంటూ ప్రకాశరావు చోటును చూపించాడు రాజయ్యకు.

"సరే. ఆలోచిస్తాను లెండి" అన్నాడు రాజయ్య.

"కాదు మీరలా చెప్పకూడదు. పెద్దవాళ్ళు ముఖ్యంగా మీలాంటివాళ్ళ సలహాసంప్రదింపులు కావాలి."

"బాగానే వుంది."

"అపార్థం చేసుకోకండి. రేపట్నుంచి మీరు తప్పకుండా రావాలి."

"ఆలోచిస్తాను" అంటూ వెళ్ళి పోయాడు రాజయ్య.

*      *      *

చెప్పిన ప్రకారం రాజయ్య యింటికి రావడం తోనే లాల్ జీ ఆయనకి మర్యాదచేసి తక్తుమీద కూర్చోపెట్టి, ప్రకాశరావు సొరుగుబల్ల రాజయ్య ముందు పెట్టి "కొంచెం జాగ్రత్తగా చూసిపెట్టండి. పెద్దవాళ్ళ అండలేదు. మీరే యికనించి మాకు పెద్ద" అన్నాడు.

రాజయ్య యేమి మాట్లాడలేదు నవ్వి వూరుకున్నాడు.

"మీ సహాయంకోసం వద్దామని అనుకుంటున్నాను మీరే వచ్చారు ఇంతకంటే నాకేం కావాలి?" అన్నాడు లాల్ జీ.

"దాందేముంది లెండి" అన్నాడు రాజయ్య.

"మీ పలుకుబడి గౌరవమూ నాకు తెలియందికాదు. మీ అసరావుంటే వ్యాపారం అనేక రేట్లు పెరుగుతుందనే నమ్మకం నాకుంది నాకింతకంటె ధేం కావాలి?"

ఈరకంగా ఓగంటసేపు వాళ్ళ సంభాషణలు సాగినయ్. ప్రకాశరావు వచ్చేటప్పటికి రాజయ్య, తన సొరుగుబల్లని దగ్గరపెట్టుకొని ఏదో రాసుకుంటూవుండడం చూశాడు. లాల్ జీగారుగాని రాజయ్యగాని ఆయన్ని చూడలేదు. మెల్లిగా తన తివాసీమీద కూర్చొని,

"సొరుగుబల్ల నాకివ్వండి" అన్నాడు ప్రకాశరావు.

మేలుకున్నట్టు వులిక్కిపడి ప్రకాశరావు వైపు చూసాడు రాజయ్య.

"సొరుగుబల్ల యివ్వండి" అన్నాడు ప్రకాశరావు.

"ఏ సొరుగు?" అన్నాడు రాజయ్య.

"అదే!—"

"ఎందుకు?—"

"వ్రాసుకోవాలి"

"నేనుతీసుకున్నాను నాకుపనుంది."

"నేను అవసరంగా వ్రాసుకోవలసిన కాగితాలున్నయ్ - ముందిటుపంపించండి" అన్నాడు అతను.

"ఏమండీ లాల్ జీ గారూ?" అన్నాడు రాజయ్య. లాల్ జీ వాళ్ళిద్దరివైపు చూశాడు.

"నాకు చాలాతొందర పనులున్నయ్ ఇవ్వమనండి"

"పాపం, ఆయనగారికి ఈవిషయాలు క్రొత్త.

నేనేయిచ్చాను. మీరింకొకటి చూచుకోండి" అన్నాడు లాల్ జీ.

లాల్ జీగారి మాటలు విడ్డూరంగా విచిత్రంగా కనిపించినయ్, ప్రకాశరావుకి ఏమీపాలుపోలేదు. కొంచెంసేపు వూరుకొని— "ఆ సొరుగుబల్లని నేను తయారుచేశాను— ఆ సొరుగుబల్లని చాలా కాలం నాశ్రమాశక్తి ఖర్చు పెట్టి నిర్మించు కున్నాను. ఎవరి సహాయ సంపత్తులూ సొరుగును తయారుచేయడంలో నేను కోరలేదు. ఇప్పటి దాకా ఆ సొరుగును నేనే వాడుకుంటున్నాను" అన్నాడు.

"నేను కాదన్నానా?" అన్నాడు లాల్ జీ

"పనిపాటూ చేసుకునేందుకు బాగాఉంటుం దని నేనే యిక్కడికి తెచ్చాను"

"అవును"

"మీరిప్పుడు రాజయ్యని వాడుకోమనడం నా కేమీ అర్థం కావటంలేదు" గబగబా అన్నాడు. ప్రకాశరావు మొహం జేవురించిపోయింది బాగా.

"ఇంతమాత్రానికే బాధపడితే ఎలా?— ఆయన పెద్దవాడు కాబట్టి రాజయ్యగద్ద వుండడం మంచిదని వుంచాను మీ కాగితాలూ వస్తువులూ ఆ సొరుగులోనే కొత్తది వచ్చిందాకా వుంచండి. ఆయనమాత్రం కాదంటాడా?—" నవ్వాడు లాల్ జీ

"పట్టుపట్టుకొని నే నిప్పుడు మళ్ళీ కొత్తది నిర్మించుకోవడం — దానికోసం తిరిగి శ్రమనీ శక్తినీ ఖర్చుపెట్టడం సబబుగాదు. మీరే యింకొకటి ఆయనగారికి ఏర్పాటు చేసివ్వండి" అన్నాడు ప్రకాశరావు.

"ప్రస్తుతం రాజయ్యగారు వ్రాసుకునేందుకు ఏమీలేదు కాబట్టి..."

"ఇదేనా వస్తువును ఇవ్వడానికి మీరు నిశ్చ యించారన్న మాట ?"

"వస్తువుమీదే. కాదనడంలేదు. మీకొక్కటి తీసుకునేందుకు నేను పైకంయిస్తాను కొత్తది చేయించండి"

ప్రకాశరావుకేమీ మాట్లాడలేదు. కోపాన్నీ, ఆవేశాన్నీ మనసుఖాన్నే ఇముడ్చుకుని పనిలో నిమగ్నమైపోయాడు. కానీ అతనేమీ పనిచేయ లేకపోయాడు. హృదయమంతా సొరుగు బల్ల మీద లగ్నమైపోయింది. లాల్ జీ అనునయ వాక్యాలు, అధారటీ ప్రకాశరావుకేమీ నచ్చ లేదు.

నెలరోజులు గడచిపోయినై. ఈ నెలరోజు లలోనూ లాల్ జీగారు ప్రకాశరావుకి సొరుగు చేయించి యివ్వలేకపోవడమే కాకుండా—రాజయ్య మాటలతో అనేకరకాల వొత్తిడిచేశాడు. ఐనా ప్రకాశరావు లొంగిపోలేదు. మేరువులా ధైర్యంగా నుంచొని, భూమిలా ఓర్పుసు సహనాన్ని చూపిం చగలిగాడు.

* * *

తననెవరో బొట్టుపెట్టి ఆహ్వానించినట్లే— ఒకనాడు ఇంట్లోకొచ్చాడు. లింగయ్య!

లాల్ జీగారి ఇంట్లో ఆరోజు చాలా హడా విడిగావుంది. ఇళ్ళంతా తోరణాలతో, రంగు రంగుల కాగితాలతో అలంకరించారు. వచ్చిన జనాన్ని ఆహ్వానించి మర్యాదచెయ్యడంలో లాల్ జీ మునిగిపోయాడు!

గడపలో కాలు గడపలోవుండగానే లాల్ జీ అతన్ని ఆహ్వానించి:

"లింగయ్యగారా? రండిరండి, లోపలికిరండి! అంతకంతకీ తీరికలేకుండా వుంది పని... మీరు కూడా మా వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉండి పనిచేసి పెడతారని నమ్ముతాను"అన్నాడు.

తీరికలేకుండావున్న ప్రకాశరావు ఈ విష యాన్నేమీ పట్టించుకోలేదు. ఇంట్లోని వ్యవహా రాన్ని, జరగవలసినవియన్నీ అతను మననంచేసు కుంటున్నాడు.

"అవునండి లింగయ్యగారుకూడా మనకు అండగావుంటే పనులు చాలా తొందరగా తెము ల్తాయ్!"అన్నాడు రాజయ్య.

"అదేమిటండీ?" అన్నాడు లింగయ్య.

"ఏమీలేదు. మీలాంటివాళ్లు కొంతమంది కావాలి. నువ్వేకాకుండా హనుమంతరావును కూడా మన వ్యవహారంలోకి తీసుకువస్తే బావుం టుంది. లాల్ జీగారుకూడా సంతోషిస్తారు" అన్నాడు రాజయ్య.

"నేను పేరుకు పెద్దగానీ ఇటువంటి విషయా లన్నీ రాజయ్యగారే చూస్తుంటారు. వారు చెప్పి నట్టు మీరూ హనుమంతరావుగారూ ఈ వ్యవహా రాల్ని చూపెడుతూవుండండి మీ కృషి వృధా కాదు—"అన్నాడు లాల్ జీ.

లింగయ్య నవ్వుతూ లాల్ జీవైపు చూశాడు.

"రేపట్నుంచి మీరా ప్రకాశరావుగారి తివాసీకి దక్షిణంగా కూర్చోండి ఆ స్థలం మీకు చాలా అనుకూలంగా వుంటుంది" అన్నాడు లాల్ జీ.

"సరేనండి" అన్నాడు లింగయ్య.

"చెబుతానుండండి—" అంటూ లాల్ జీగారు ప్రకాశరావును పిలిచి ఈ విషయం చెప్పాడు.

వింతగానూ, ఆశ్చర్యంగానూ ప్రకాశరావు లాల్ జీగారి కళ్ళల్లోకి చూచాడు.

"నాకు తెలుసు నాకు చాలా ఆశ్చర్యంగానే వుంటుంది-ఏం చేస్తాం? వున్నదాంట్లోనే సర్దుకోవాలి. ఒకరి ప్రక్క ఒకరు సర్దుకుని కూర్చున్న తర్వాత పరిస్థితుల్ని బట్టి-మీ ఇబ్బందుల్ని బట్టి... "వుత్తరం" గావున్న గోడనిపగలగొట్టి విశాలంగా వుండేట్లు ఏర్పాటుచేస్తాను—" అన్నాడు లాల్ జీ.

"మీ మాటను కాదనను నేను. కాని, నలుగురికీ తెలిసి-నలుగురూ నేను కూర్చుంటున్న స్థలం యిదనీ, ఈ స్థలం నాదనీ నమ్మి ఇక్కడికివస్తున్న పరిస్థితుల్లో నాకు దక్షిణంగా లింగయ్యగారిని కూర్చోపెడితే-ఉన్న కొద్దిపాటి స్థలంలో ఎలా సర్దుకోను? నా పనులేవిధంగా చూసుకోను?"

ప్రకాశరావు మాటలూ వాలకమూ లాల్ జీగారికి కొంచం కష్టాన్నే కలిగించినయ్. ప్రళయ జంఝామారుతంలా వీచే వడగాలికి ఇల్లు కూలిపోయే పరిస్థితులో, పేకమేడలా కూలిపోకుండా ఎవ్వరూ ధైర్యం చెయ్యలేనప్పటికీ, ఒంటరిగా నిలబడి కాపాడిన క్షణాలు, చేసిన సహాయాలూ అన్నీ లాల్ జీగారు మరిచిపోయినట్లు "నాకు తెలుసండీ, మీకు దక్షిణంగా లింగయ్యగారు వుండాలి—అంతగా స్థలం చాలక ఇరుకైన పరిస్థితుల్లో-ఉత్తరంగావున్న గోడను పడవేసి మీరు "విశాలం" గా కూర్చునేందుకు సరిచేస్తానన్నాగా" అన్నాడు.

"మనలో మనం సర్దుకోకపోతే ఎలానండీ రావుగారూ?" అన్నాడు లింగయ్య.

రాజయ్య ఇదేమీ తనకుపట్టనట్లు ఏదో ఆలోచిస్తూ నిలుచున్నాడు.

ప్రకాశరావు హృదయం మండిపోయింది "నేను తయారుచేసిన (నగషీలుపెట్టి అందంగా) నా సొరుగుబల్లని రాజయ్యగారికి యిప్పించి, కావాల్సింటే నా కాగితాల్ని అందులోనే పెట్టి వాడుకొమ్మనమనీ ఎన్నో రోజులనుంచి నా స్థలమనుకుంటున్న జాగాలో తీరా యీనాడు లింగయ్యగారికి దక్షిణంగా కూర్చునేందుకు స్థలమివ్వమనీ, ఇబ్బందిపడితే ఉత్తరపు గోడ పగులగొట్టి విశాలంగా చేస్తాననడం బావుండలేదండి" అన్నాడు గబగబా.

"పెద్దవారైన యజమాని చెబుతున్నప్పుడు మీరిలా చెప్పడం బావుండలేదు-న్యాయం కాదు" అన్నాడు రంగయ్య.

"ఇదెక్కడి న్యాయం?"

"పెద్దవారెప్పుడు న్యాయమే చెప్తూతారు. అన్యాయం చెప్పరు. అయినా మీరు స్థలంచాలక ఇబ్బంది పడేట్లయితే - ఉత్తరపు గోడ పగలగొట్టించి మీకు విశాలంగా ఏర్పాటు చేస్తానన్నప్పుడు మీరలా లాల్ జీగారితో మాట్లాడటం బావుండలేదు."

ప్రకాశరావు మనస్సు గడ్డబారిపోయింది. పాపం యేంచేస్తాడు? వినేవాళ్లులేక, చెప్పినా ప్రయోజనంలేదని తేలిపోయేప్పటికి ఆయన మళ్ళీ మాట్లాడలేదు!

"ముందువచ్చిన చెవులకంటే - వెనుక వచ్చిన కొమ్ములువాడి!" అనుకున్నాడు ప్రకాశరావు.

---

వారాంతాన జీతం పుచ్చుకుని సిపాయిలిద్దరూ ఊరుమీద పడ్డారు. హుషారిచ్చే నిషాకోసం డబ్బంతా కర్చుపెట్టి షికార్లుకొడుతూ చివరకి సముద్రపు ఒడ్డు చేరుకునేసరికి అప్పుడే చంద్రోదయం అవుతూంది. ఉదయిస్తున్నది చంద్రుడో సూర్యుడో వాళ్లకి తెలియక దారినపోయే ఓ పెద్ద మనిషిని పిలిచి అడిగారు.

"నాకు తెలియదు. నాకూ యీవూరు కొత్తే!" అన్నాడా పెద్దమనిషి.